నిలువెత్తు తెలంగాణ సంతకం, కాళోజీ

సాగిపోవుటె బ్రతుకు ఆగిపోవుటె చావు సాగిపోదలచిన ఆగరాదెపుడు తొలగి తోవెవడి చ్చు త్రోసుకొని పోవలయునంటూ తెలంగాణ భాష, యాస, కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదా యాల పరిరక్షణకు, మానవజాతి అభ్యున్నతికి నడుంకట్టిన నిలువెత్తు తెలంగాణ సంతకం కాళోజీ. తెలంగాణ యాసను ఈసడించుకుంటున్న తెలుగు వైయాకరణులను నిలదీస్తూ మా రచనణల్లో వ్యాకరణ మాత్రమే లేదు, మీ రచనల్లో వ్యాకరణ తప్ప మరేమీలేదని నిర్మోహమా టంగా నినదించాడు. మెరుపువలె పరిగెత్తే మా ఊహా తరంగాలకు బక్కెద్దులనాపే పగ్గాల్లాం టి మీ వ్యాకరణాలు ఏ మేరకు పనికొస్తాయని ప్రశ్నించాడు. శతాబ్దాల తరబడి ప్రవాహంలో పడి, రాపిడి పుణ్యాన రూపురేఖలు దిద్దుకున్న ముద్దువచ్చే రాళ్ళను, శివలింగాలను కన్నులక ద్దుకొని భక్తులు పూజకై దాచుకున్నట్లు, మానోట రాలిన మాట ఆనోట ఈనోట వీనులవిందై, మనసుకు పసందై జపించి జపించి సూత్రాలలో బిగించి సారస్వత పూజా ద్రవ్యంగా భద్రప రుచుకున్నారు మీవైయాకరణలు అంటూ వారి నిజస్వరూపాన్ని నిరూపించాడు. ఒకడు కు తికెలదాక మెక్కినోడు మరొకడేమో మింగ మెతుకులేనోడు ఇద్దరికీ గొంతు పెకలదు, ఇలా తి నడానికి తిండిలేని కృషించిన గొంతు లోపలిగద్గద స్వరంలోని సంఘర్షనలోంచే నాగొడవను వెలువరించాడు. నేనంటే నేటి మనస్థితి వైనం నేనంటే భారత పౌరుడు నేనంటే ఒక వోటరు నేనంటే ముక్కోటి తెలంగాణ గొంతుకుల అక్రోశమని గొంతెత్తి ఆలపించాడు, ఆ అక్రోశమే అరుణకిరణమై కాళోజి కన్న కలలు నేడు ఫలించాయి. మీజాన్ పత్రిక ఎడిటర్ రాంభట్ల కృ ష్ణమూర్తి ఆనాటి తెలంగాణ రచయితల రచనలభాషను సవరిస్తూ, తెలుగుచేస్తూ మీజాన్‌లో రాయాల్సి వచ్చేదని తెలంగాణ భాషను విమర్శించడాన్ని కాళోజీ ఆనాడే ఖండించారు.

1932 లో కోస్తా ప్రాంతీయుడైన రాఘవాచార్యులు 'తెలంగాణలో ఆంధ్రకవులు పూజ్య మని గోలకొండ పత్రికకు రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరంగా కాళోజీ జీవితం నిలిచింది. పుట్టు

క నీది చావునీది బ్రతుకంతా దేశానిదని లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ గురించి కాళోజీ రాసిన మాటలు అక్షరాల కాళోజీకి వర్తిస్తాయి. తన జీవితకాలమంతా తెలంగాణంలో బడుగు వర్గాల జీవన సంఘర్షణలను తనగొడవగా చెప్పుకొంటూ తెలంగాణ 'యాస' కాదు అదొక భాషని నిరూపించడంలో కృతకృత్యుడయ్యాడు. రెండున్నర జిల్లాల భాషనే అందురూ రాయాలనే ప్రామానికభాష శాసనాన్ని ఆయన ధిక్కరించాడు. ప్రామాణికమనేది భాషకు వర్తించదని, ఎవరి వాడుక భాష వారిదని, అదే భాషలో రాయాలని రాసి చూపించిన మార్గదర్శకుడాయన. మనం వేరే భాషలో రాస్తే మన మనసు చంపుకున్నట్లేనని, మన భావాలు తొక్కిపెట్టినట్లేనని మనం బానిసలమైనట్లేనని ఈ బానిస బ్రతుకు ఇంకెనాళ్ళు కొనసాగుతుందని ప్రశ్నించాడు.

ఇంగ్లీషు వాళ్ళచ్చి నాకు ఆంగ్లం రాదన్నారు సరె, ముస్లీంలొచ్చి నాకు ఉర్దూ రాదన్నారు సరె మరి మన పప్పులో ఉప్పేసి పొత్తుగూడినోళ్ళు నాకు తెలుగే రాదని,నాదసలు తెలుగే కాదనిఈసడిస్తే నేనెట్లా ఒపిక పట్టాలె గా భద్మాష్‌గిరిని అంటూ తెలంగాణ మాండలికం గొప్పదనాన్ని ఎలుగెత్తి చాటాడు. తెలంగాణ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే పండుగలెన్నో ఉన్నాయి. ఆ పండుగల్లో అనాది నుండి తెలంగాణ జానపదులు ఎన్నోపాటలు తెలంగాణ యాసలోనే పాడుకుంటున్నారు, నేడది భాషే కాదంటే ఆ జానపద సాహిత్యమేమై పోవాలని వాపోయాడు. ఏ రేడియోలనన్నా, టీవీలనన్నా, సీనిమాలనన్నా తెలంగాణభాష వినబడ్తదా? తెలంగాణ భాషంటే రౌడీలు, పనిమనుషులు మాట్లాడే భాషేనా? అంత అగ్వకున్నదా తెలంగాణభాష? ఈ దౌర్జన్యం ఇనాళ్ళు సహించినం, ఇక సహించవద్దు, దోపిడినెదుర్కోవాలె నేను గిట్లనే మాట్లాడ్త, గిట్లనే రాస్త అంటూ జిద్దుకు దిగాడు. ఇది జిద్దు కానేకాదు అసలు సిసలైన మన బ్రతుకుదెరువు పోరాటం అందుకే మనం మన కవులను రచయతలను గుర్తించి గౌరవించుకోవాలని నొక్కివక్కానించాడు.రాయి రువ్వినా రాకెట్ విసిరినా గిట్టని వాన్ని కొట్టుటకే కదా, కాల నడిచినా కారెక్కినా కోరిన చోటుకి చేరుటకే కదా, గేగు కొరికినా కేకు నమి

లినా ఆకలిమంటను ఆర్పుటకే కదాని తెలంగాణలోని బ్రతుకు దుర్భరాన్ని నా గొడవలో విల పించి వినిపించాడు. కాళోజీ ఒక సామాన్య మానవుడో, కవో మాత్రమే కాదు, ఆయన స్వాత ంత్ర్యసమసర యోధుడు, శాంతివిప్లవవాది, అన్నింటికి మించి ప్రజాకవి. నిజాం నవాబుకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకెళ్ళాడు. అంతే కాకుం డా గాంధీజీ సత్యాగ్రహం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వందేమాతర ఉద్యమ ం, ఆర్య సమాజం, రాష్ట్రకాంగ్రేస్, తెలంగాణలో ఆంధ్ర మహాసభ, రజాకార్ వ్యతిరేకోద్యమం లాంటి అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసిన చైతన్య దీప్తి. పాఠశాల స్థాయి నుండే కవితారచన మొదలెట్టిన కాళోజీ భగత్‌సింగ్ ఉరితీతకు ఉద్వేగంగా /93/లో మొదటి రచన వెలువరించాడు. ఆకటికి అలమటిస్తున్న పసివాన్ని, నిలువనీడలేని అభాగ్యు లని, ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన విప్లవీరులను చూసి చలించిపోయాడు.

సామాన్యుని గోస చూసి వ్యధ చెందిన కాళోజీ ప్రభుత్వానికి భయపడకుండా చెప్పాల నుకున్నది సూటిగా ప్రజల భాష ప్రజల యాసలో చెప్పి ప్రజాకవనిపించుకున్నాడు. సమకాలీ న చారిత్రక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతికాంశాలకు రన్నింగ్ కామెంటరీ కాళోజీ కవిత్వ మని దాశరథి చెప్పిన మాటలు అక్షర సత్యం. సమస్త మానవీయ కోణాల్ని సమగ్రంగా పరిశీ లించి సామాన్యుల బాధల్ని తన బాధలుగా, ప్రతివాడి గోడును తన గొడవగా వినిపించిన మానవతామూర్తి. అందుకే బహుముఖ ప్రజాశాలైన కాళోజీ తెలంగాణ పదానికి ప్రతిరూపం, తెలంగాణ సంస్కృతికి ఆత్మస్వరూపం, నిలువెత్తు తెలంగాణ సంతకం.

రచయిత

డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి

తెలుగు అధ్యాపకులు

శ్రీ రాజ రాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్

సెల్: 9440749830